అక్రమ మైనింగ్‌కు.. అధికార యంత్రాంగం సలాం

అధికారుల ఉదాసీనత వైఖరి కారణంగా మండలంలోని లాం గ్రామంలో టీడీపీ నాయకుల అక్రమ గ్రావెల్ దందా నిర్విరామంగా కొనసాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా కొండల్ని పిండి చేస్తూ.. తిలోదకాలిస్తున్నారు. బ్లాస్టింగ్ చేసి మరీ.. గ్రావెల్‌ను తోడేస్తున్నారు. ప్రయివేటు వెంచర్లకు మట్టి అమ్ముకొని రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందా గత రెండు నెలలుగా యథేచ్ఛగా కొనసాగుతోంది. కానీ, అధికారుల కళ్లకు మాత్రం కనిపించడం లేదు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతున్నా పట్టడం లేదు.

- లాం గ్రామంలో యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు
- 70 ఏళ్ల సొసైటీని పక్కన పెట్టి టీడీపీ నేతల దౌర్జన్యం
- తమ పొట్టకొడుతున్నారని కార్మికుల ఆవేదన
- జనావాసాల్లో బ్లాస్టింగ్.. ఎగసి పడుతున్న రాళ్లు
- ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు, వేధింపులు
- వీఆర్వో నుంచి కలెక్టర్ వరకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- అక్రమార్కులకు సమాచారమిచ్చి.. తనిఖీలకు వస్తున్న మైనింగ్ అధికారులు


లాం గ్రామంలో బ్లాస్టింగ్‌తో కొండల్ని పిండి చేసి గ్రావెల్ తవ్వుతున్న పొక్లెయినర్

తాడికొండ: మండలంలోని లాం గ్రామంలో తవ్వకాలు జరపాలంటే స్థానికంగా 70 ఏళ్లుగా ఎన్నికలతో ఏర్పాటవుతున్న క్వారీ సొసైటీ ద్వారా నే జరగాలి. 1959లో రిజిస్టర్ అయిన ఈ కో–ఆపరేటివ్ సొసైటీకి ప్రతి ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించి, కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. సభ్యులందరూ కొండ క్వారీయింగ్ పనులు చేసుకొని ఉపాధి పొందుతున్నారు. దీనిపై కన్నేసిన టీడీపీ నాయకులు గత ఎన్నికల్లో చావుదెబ్బ తిని, ఓటమి పాలయ్యారు. ఈసారి ఎలాగైనా క్వారీ సొసైటీపై ఆధిపత్యం చలాయించాలనే దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిబంధనలకు తిలోదకాలిచ్చి పగలు, రాత్రి బ్లాస్టింగ్ చేస్తున్నారు. గ్రావెల్‌ను తరలింపు జోరుగా కొనసాగిస్తున్నారు.

పేదల పొట్టకొడుతున్నారు

అక్రమ తవ్వకాలపై స్థానిక క్వారీ సొసైటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదలు పొట్టపోసుకునేందుకు ఏర్పాటు చేసిన క్వారీ సొసైటీని టీడీపీ నాయకులు ఆక్రమించి రూ.లక్షల అక్రమ సంపాదన చేసుకోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి అక్రమ తవ్వకాలు నిలిపివేయించకపోతే కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు.

ప్రశ్నిస్తే అక్రమ కేసులు

గ్రామంలో టీడీపీ నాయకులు చేస్తున్న అక్రమాలపై ఎదురు మాట్లాడిన వారిపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేయడం పరిపాటిగా మారింది. ఒక్క గ్రావెల్ దందానే కాకుండా, ఇళ్ల స్థలాల దందాలో కూడా వీరు హస్త లాఘవం ప్రదర్శించడం మొదలు పెట్టారు. ఇప్పటికే ఆక్రమణల కూల్చివేత పేరుతో అధికారులను అడ్డుపెట్టుకొని బెదిరింపులకు పాల్పడుతున్నారు. నోరు మెదిపితే కేసుల్లో ఇరికిస్తాం అంటూ బహిరంగంగా హెచ్చరికలు చేస్తున్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

జనావాసాల మధ్య బ్లాస్టింగ్ చేస్తుండటంతో రాళ్లు, దుమ్ము లేచి తాము ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇటీవల క్వారీ సొసైటీ సభ్యులు మైనింగ్ డీడీ, రెవెన్యూ, జిల్లా కలెక్టర్, విజిలెన్స్ ఎస్పీ, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కానీ, ఫలితం శూన్యం. శుక్రవారం దీనిపై సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో మైనింగ్ అధికారులు నామ మాత్రంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా తామొస్తున్నామన్న సమాచారం నిర్వాహకులకు ముందుగా అందజేశారు. దీంతో వారు వచ్చే లోపల క్వారీలో ఉన్న పొక్లెయిన్‌ను పక్కన పెట్టేశారు. మళ్ల గంటల వ్యవధిలోనే యథావిధిగా అక్రమ తవ్వకాలు ప్రారంభించారు.


గ్రావెల్ తవ్వకాల వద్ద టీడీపీ నాయకులు వేసుకున్న కుర్చీలు

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



జిల్లా కలెక్టర్, మైనింగ్ డీడీ, తహసీల్దారు, విజిలెన్స్ ఎస్పీ, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో పలువురు అధికారులకు క్వారీ సొసైటీ తరుపున అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదు చేశాం. కానీ ఇంత వరకు చర్యలు తీసుకోలేదు. ఎవరైనా గట్టిగా మాట్లాడితే తప్పుడు కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. కార్మికుల హక్కులు కాపాడాలి.

– షేక్ షాజహాన్, క్వారీ సొసైటీ సభ్యుడు, మాజీ కార్యదర్శి

ప్రశ్నిస్తే..ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టారు



గ్రామంలో జరుగుతున్న అక్రమ గ్రావెల్ దందా ఇతర అక్రమాలపై ప్రశ్నించినందుకు నాపై కక్షగట్టి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించారు. క్వారీ సొసైటీ హక్కులను హరించి, గ్రావెల్ దందా చేస్తున్న టీడీపీ నాయకుల వైఖరిపై కోర్టును ఆశ్రయించి నిజం నిగ్గు తేల్చుతాం.

– షేక్ ఆదిల్, మాజీ అధ్యక్షుడు, క్వారీ సొసైటీ

క్లుప్తంగా

డిపాజిట్లపై అత్యధిక వడ్డీ



మంగళగిరి (తాడేపల్లిరూరల్) : కనక మహాలక్ష్మి కో–ఆపరేటివ్ బ్యాంక్ డిపాజిట్లపై అత్యధిక వడ్డీ కల్పిస్తోందని చైర్మన్ కె.రాంబాబు తెలిపారు. సోమవారం మంగళగిరి శాఖ కార్యాలయంలో 8వ వార్షికోత్సవం నిర్వహించారు. కస్టమర్లతో నిర్వహించిన సమావేశానికి బ్రాంచ్ మేనేజర్ జి.మమత అధ్యక్షత వహించారు. చైర్మన్ రాంబాబు మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రాంతాలకు డీడీ సౌకర్యం ఉందని, బంగారు ఆభరణాలపై తక్షణ రుణ సదుపాయం, విదేశీ మార్గత ద్రవ్య సదుపాయం వంటి సేవలు తమ బ్యాంకులో ఉన్నాయని ఖాతాదారులకు తెలియజేశారు. సీఈవో కె.శ్యామ్ కిషోర్, రీజినల్ మేనేజర్ జె.మురళి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవంపై వినతి

ఫిరంగిపురం: జీవో నంబరు 128 ప్రకారం ప్రతి నెలా 30వ తేదీన పౌరహక్కుల దినం నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందని మండల దళిత సామాజిక వర్గ ప్రతినిధులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ నామా ప్రశాంతికి వినతి పత్రం అందజేశారు. ఇటీవల దళితులపై దాడులు జరిగిన గ్రామాల్లో అన్ని సామాజిక వర్గాలతో సమావేశాలు నిర్వహించి, చట్టాలపై అవగాహన కల్పించాలని కోరారు. పిల్లి.రాజు, జె.సాల్మన్, చుక్కా సాగర్, భాగ్యరాజు, పి.రవి ప్రసాద్ ఉన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి పట్టణ పరిధిలోని పోలేరమ్మ దేవస్థానం వద్ద ఉన్న నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టీడీపీ నాయకులు అవ్వారు వెంకటేశ్వర్లు సోమవారం విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర పద్మశాలీయ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య పాల్గొన్నారు. 100 మంది విద్యార్థులకు నాలుగు నోట్ పుస్తకాలు లెక్కన అందజేశామని తెలిపారు. నాయకులు జంజనం సత్యనారాయణ, కారంపూడి రామకృష్ణ, నందం సత్యనారాయణ, పంచల నరేష్, తిరువీధుల ప్రసాద్, సాయి, ఫణి, జింకా మల్లేశ్వర రావు పాల్గొన్నారు.

శివాలయంలో అన్నదానం

మంగళగిరి (తాడేపల్లిరూరల్) : మంగళగిరిలో గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ భక్తుల సహకారంతో ప్రతి నెలా అమావాస్య తర్వాత వచ్చే సోమవారం అన్నదానం చేస్తున్నట్లు వెల్లడించారు. దాతలకు ధన్యవాదాలు తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల కోటేశ్వరరావు, ట్రస్ట్ ప్రతినిధులు శివ సత్యనారాయణ, విష్ణుమూర్తి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



మంగళగిరి (తాడేపల్లిరూరల్) : చినకాకాని చెరువును కొంత మంది ఆక్రమించుకుని రేకుల షెడ్డుల నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు సోమవారం ఘటనా స్థలానికి వెళ్లి చెరువు కట్టను ఆక్రమించి నిర్మించిన రేకుల షెడ్డును నేలమట్టం చేశారు. గతంలో ఈ చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించామని, ట్రాక్‌ను ఎవరైనా ఆక్రమిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

బస్సు ఢీకొని యాచకుడి మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆర్టీసీ బస్సు ఢీకొని యాచకుడు మృతి చెందిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు వివరాల మేరకు.. గుంటూరు జిల్లా తుళ్లూరుకు చెందిన మల్ల ఏడుకొండలు(32) ప్రతి రోజు బస్టాండ్‌కు వచ్చి భిక్షాటన చేసుకుని, సాయంత్రం స్వగ్రామం వెళ్తుంటాడు. ఉదయం ప్లాట్ ఫాం నంబర్ 21 నుంచి మచిలీపట్నం డిపో బస్సు రివర్స్ తీస్తున్న సమయంలో బస్సు వెనుక భిక్షాటన చేస్తున్న ఏడుకొండలును ఢీకొట్టింది. సమాచారం మేరకు.. 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రిక్వెస్ట్ స్టాప్ బోర్డు ఏర్పాటు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని మార్నింగ్ స్టార్ డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థుల కోసం సోమవారం ఆర్టీసీ బస్సు రిక్వెస్ట్ స్టాప్ బోర్డు ఏర్పాటు చేసినట్లు కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మద్దు బాలస్వామి చెప్పారు. నరసరావుపేటలోని ఆర్టీసీ ఎండీని కలిసి కళాశాల వద్ద బస్సు ఆపాలని కోరామని ఆయన అంగీకరించారని తెలిపారు.

ప్లాస్టిక్ రహితంగా మంగళగిరి

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని, ప్రజలందరూ ఇందుకు సహకరించాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా కోరారు. సోమవారం ఎంటీఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు కార్పొరేషన్ పరిధిలో 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ సంచులు, పేపర్లు, సింగిల్ యూజ్ బాటిల్స్ విక్రయం నిషేధమన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారికి భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్లాస్టిక్ నిషేధంపై నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయ సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి, తగు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. దుకాణాల ముందు బిన్‌లు ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు.

236 మందికి వైద్య పరీక్షలు

ఫిరంగిపురం: తక్కెళ్లపాడు గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. బఫర్ వైద్యురాలు శాంతి 236 మందికి వైద్య పరీక్షలు చేశారు. షుగర్, బీపీ, థైరాయిడ్, యూరిన్ పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులను కూడా పరీక్షించారు. గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు శీతాకాలం వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉన్ని దుస్తులు ధరించాలని, వేడి ఆహారం తీసుకోవాలని, భోజనానికి ముందు చేతులు శుభ్రంగా చేతులు కడుక్కోవాలని చెప్పారు. సీహెచ్‌వో వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

యాజమాన్య కమిటీల బాధ్యతపై అవగాహన

ఫిరంగిపురం: వేమవరం ఎంపీపీ పాఠశాలలో సోమవారం పాఠశాల యాజమాన్య కమిటీల పాత్ర, బాధ్యతలపై సమావేశం నిర్వహించారు. సర్పంచ్ మున్నంగి శివకుమారి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ జెట్టి సుబ్బయ్య మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం దీవి కమల్‌మోహన్, విద్యాసెక్రటరీ వెంకటేశ్వరనాయక్, ఉపాధ్యాయుడు శేషు రవికుమార్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలివ్వాలని ధర్నా

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కౌలు సాగు గుర్తింపు కార్డులు (సీసీఆర్‌సీ) పొందిన ప్రతి కౌలు రైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలివ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు డిమాండ్ చేశారు. సోమవారం దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో యూనియన్ బ్యాంక్ వద్ద కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి బ్యాంకర్స్ కమిటీ మీటింగ్‌లో కనీసం భూ యజమానులు పంట రుణాలు తీసుకోని సందర్భాల్లో అయినా కౌలు రైతులకు పంట రుణాలు ఇస్తామని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కానీ కింది స్థాయిలో బ్యాంకు మేనేజర్లు తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారని పేర్కొన్నారు. కౌలు రైతుల చట్టంలో వెంటనే మార్పు చేయాలని, భూ యజమానితో సంబంధం లేకుండా ప్రభుత్వమే కౌలు రైతులను నేరుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం. నాగమల్లేశ్వరరావు, బైరగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి రైతుకు రూ.2లక్షల వరకు షూరిటీ లేని పంట రుణాలు ఇవ్వాలని రిజర్వ్ బ్యాంక్ నిబంధనలను చెబుతున్నప్పటికీ ఎక్కడా అమలు కావడం లేదన్నారు. పంట రుణాలు ఇవ్వకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అనంతరం బ్రాంచ్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు తోకల రామారావు, కోటా ప్రభాకర్ రావు, నెమలికంటి దానయ్య, మరాల గోపి ప్రసాద్, వల్లభాపురం వీరయ్య, స్వప్న, మండవ సునీత, జి.కృష్ణారావు, ఎస్.వెంకటరావు, చిలువూరు, తుమ్మపూడి, రేవేంద్రపాడు రైతులు పాల్గొన్నారు.


యూనియన్ బ్యాంక్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న కౌలు రైతులు

రేషన్ దుకాణం తనిఖీ

ఫిరంగిపురం: వేమవరం గ్రామ శివారు కండ్రిక గ్రామంలో 0724030 నంబరు రేషన్ దుకాణాన్ని తహసీల్దార్ జె.ప్రసాదరావు సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. రేషన్‌కార్డు దారులకు పంపిణీ చేయకుండా ఉంచిన బియ్యం, పంచదార, కంది పప్పు గుర్తించినట్లు తహసీల్దార్ తెలిపారు. రేషన్ దుకాణదారు(వినాయక మహిళా సంఘం)ఎస్.శ్రీలత పంపిణీ చేయకుండా ఉంచిన 5,775 కిలోలు బియ్యం, 19 ప్యాకెట్లు పంచదార, రెండు కిలోల కందిపప్పును అక్రమంగా బ్లాక్ మార్కెటునకు తరలించినట్లు గుర్తించామన్నారు. రేషన్ దుకాణ నిర్వాహకురాలిపై 6ఏ, క్రిమినల్ కేసు నమోదు చేసేందుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేసినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట వీఆర్వోలు సుభాని, నరేష్ ఉన్నారు.

రాఘవేంద్ర రైసు మిల్లులో 335 బస్తాలు..

మండలకేంద్రంలోని రాఘవేంద్ర రైసు మిల్లులోని బంకరులో రేషన్ బియ్యాన్ని ఆదివారం రెవెన్యూ అధికారులు గుర్తించారు. సోమవారం బియ్యాన్ని కాటా వేయగా 17,295 కిలోలుగా గుర్తించినట్లు చెప్పారు. వాటిని 335 బస్తాల్లో నింపి గుంటూరులోని శ్రీభార్గవ సాయి రైసు మిల్లునకు చేర్చి, రసీదు తీసుకున్నట్లు తహశీల్దార్ ప్రసాదరావు తెలిపారు.


తనిఖీ చేస్తున్న తహసీల్దార్ జె.ప్రసాదరావు

రేషన్ బియ్యం స్వాధీనం

మేడికొండూరు: మండల పరిధిలోని పేరేచర్ల గ్రామంలో రేషన్ బియ్యం బొలేరో వాహనంలో ఉన్నట్లు సమాచారం అందుకున్న తహసీల్దారు ఎం.హరిబాబు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పేరేచర్ల గ్రామంలో బొలేరో వాహనంలో ఉన్న రేషన్ బియ్యం గుర్తించి, వాహనంపై 6ఏ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

విద్యుత్ బిల్లుల దహనం

మేడికొండూరు: విద్యుత్ బిల్లుల పెంపునకు నిరసనగా విద్యుత్ బిల్లులను సోమవారం దహనం చేశారు. మండల పరిధిలోని ఎలవర్తి పాడు గ్రామంలో సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్టీ మండల కార్యదర్శి బొట్ల రామకష్ణ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు కూటమి ప్రభుత్వం వస్తే పెంచమని, స్మార్ట్ మీటర్లు బిగించమని అనేక బహిరంగ సభల్లో కూటమి పార్టీల నాయకులు ఎన్నికల వాగ్దానం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. గెలిచిన తర్వాత ఆరు నెలలు గడవకముందే ట్రూ ఆఫ్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, అదనపు చార్జీలు రకరకాల పేర్లతో రూ.16 వేల కోట్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపి వసూలు చేస్తున్నారన్నారు. మంత్రి నారా లోకేష్ ప్రతిపక్షంలోస్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండని ప్రజల్ని ప్రోత్సహించారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం బీజేపీ అదాని స్నేహం వదులుకో లేక స్మార్ట్ మీటర్లు దొంగతనంగా బిగిస్తోందన్నారు. రాబోయే కాలంలో టీడీపీ వైఖరిని నిరసిస్తూ విద్యుత్ రేట్లు తగ్గించే వరకు ప్రజలు ఆందోళనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.


విద్యుత్ బిల్లుల దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

బడేపురంలో ఘనంగా ముగ్గురు రాజుల పండగ

బడేపురం(తాడికొండ): తాడికొండ శివారు బడేపురం ఆర్సీఎం చర్చిలో ముగ్గురు రాజుల పండగ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పెదపరిమి ఆర్‌సీఎం విచారణ గురువులు ఫాదర్ మాదినేని ప్రకాష్ ఆధ్వర్యంలో దివ్య పూజాబలి అర్పించి, ముగ్గురు రాజులు ఏసు ప్రభువును దర్శించుకున్న తరుణంపై సందేశం అందించారు. ఈ సందర్భంగా గ్రామంలో కన్నె మరియమ్మ, ఏసు ప్రభువు ప్రతిమలను పూలతో అలంకరించిన దివ్య రథంపై ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఇతర గ్రామాలకు చెందిన బంధువులు, మిత్రుల రాకతో గ్రామం కళకళలాడింది. మందడం, తుళ్లూరు విచారణ గురువులు ఫాదర్ తంబి, ఫాదర్ స్వామి మత కన్యలు పాల్గొన్నారు.



ఇళ్ల స్థలాలకు అర్జీల స్వీకరణ

తాడేపల్లిరూరల్: నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి కంచర్ల కాశయ్య ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నులకపేట ప్రాంతంలో పేదల నుంచి పార్టీ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల సోమయ్య, సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే పట్టణాల్లో నివసించే పేదవారికి రెండు సెంట్లు, గ్రామీణ పేదలకు మూడు సెంట్లు ఇంటి స్థలమిచ్చి, ఇల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సీపీఐ నాయకులు దొంత కోటేశ్వరరావు, షేక్ బాషా, ప్రసాద్ పాల్గొన్నారు.

ఏపీజీఈఏ క్యాలెండర్ ఆవిష్కరణ

ఫిరంగిపురం: తహసీల్దారు కార్యాలయం, పీహెచ్‌సీలలో ఏపీజీఈఏ(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం) ఫిరంగిపురం తాలూకా యూనిట్ ప్రెసిడెంట్ కొండపల్లి సుదర్శన్‌రాజు ఆధ్వర్యంలో సోమవారం క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దారు జె.ప్రసాదరావు మాట్లాడుతూ ఉద్యోగులు సంఘీభావంగా పనిచేయాలని కోరారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు, డీటీ ప్రశాంతి, శివ, ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, ఆర్ఐ అబ్దుల్ రెహమాన్, ఎంఈవోలు షేక్ మహబూబ్ సుభాని, రవికాంత్, డాక్టర్ ఫరీనా, డాక్టర్‌శ్వేత, సంఘ సభ్యులు పి.అన్నమేరి, కె.మోహన్‌బాబు, హేమలత సాయి పాల్గొన్నారు.

చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

తాడికొండ: శివారు..పట్టించుకోండి సారూ.! శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి తాడికొండ పంచాయతీ అధికారులు స్పందించారు. డీపీవో సాయి కుమార్ ఆదేశాల మేరకు జయభారత్ కాలనీకి వెళ్లే రహదారి పక్కన రెడ్ల బజారు వద్ద రోడ్డుపై వేసిన చెత్తను తొలగించినట్లు కార్యదర్శి గొట్టం హరిబాబు తెలిపారు. పంచాయతీలో సిబ్బంది సంఖ్య పరిమితంగా ఉన్నందున నార్త్ పాఠశాల వెనుక మురుగు తొలగించడంలో జాప్యం జరుగుతోందన్నారు. ఇరుకు రోడ్లు ఉన్న నేపథ్యంలో ట్రాక్టర్లు వెళ్లే పరిస్థితి లేదని, ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసుకొని త్వరలో మురుగు తొలగించనున్నట్లు తెలిపారు.

మసీదు భూముల్లో నోటీసు బోర్డు ఏర్పాటు

తాడికొండ: తాడికొండ పెద్ద మసీదుకు సంబంధించిన వక్ఫ్ భూముల్లో సోమవారం బోర్డులు ఏర్పాటు చేసినట్లు గుంటూరు, బాపట్ల జిల్లా వక్ఫ్ బోర్డు అధికారి షేక్ మ్యూక్తర్ బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నంబరు 255లో 48 ఎకరాల భూమి తాడికొండ పెద్ద మసీదు కింద ఉందని తెలిపారు.

రోడ్డు మార్జిన్ వ్యాపారులకు కౌన్సెలింగ్

మంగళగిరి (తాడేపల్లిరూరల్) : రహదారుల వెంబడి వ్యాపారం చేసుకునేవారు ట్రాఫిక్ సమస్య సృష్టించవద్దని మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ కోరారు. సోమవారం సాయంత్రం మంగళగిరి రూరల్ పరిధిలోని చినకాకాని ఎన్ఆర్ఐ జంక్షన్, పలు ప్రాంతాల్లో రోడ్డు వెంబడి వ్యాపారులకు సూచనలు చేశారు. రోడ్డు మార్జిన్ దాటి బండ్లను పెట్టొద్దని స్పష్టం చేశారు. జాతీయ రహదారి వెంబడి పలు ఆటోలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడంతో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


సూచనలిస్తున్న ఎస్ఐ వెంకట్

నిరవధిక సమ్మెలో పాల్గొన్న క్లాప్ ఆటో డ్రైవర్లు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని సీఐటీయూ సీనియర్ నాయకులు జె.వి.రాఘవులు, వి.వి.జవహర్‌లాల్, బి. వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం క్లాప్ ఆటో డ్రైవర్లు యూనియన్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట జరుగుతున్న నిరవధిక సమ్మె సోమవారం మూడో రోజుకు చేరుకుంది. నాయకులు మాట్లాడుతూ క్లాప్ ఆటో డ్రైవర్లకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం అమలు చేయాలని కోరారు. నెలకు వేతనం రూ.24,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ పట్టించుకొని సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ, యూనియన్ అధ్యక్షుడు డి.శివ, కార్యదర్శి ఎం.రవి, యూనియన్ నాయకులు ఆర్.కృష్ణ, వై.శివ, పి.శ్రీనివాసరావు, యోహాన్ పాల్గొన్నారు.


మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేస్తున్న ఆటో డ్రైవర్లు

టెన్నిస్‌బాల్ క్రికెట్ లీగ్ పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లిరూరల్ : సంక్రాంతి టెన్నిస్ బాల్ క్రికెట్ లీగ్ పోస్టర్‌ను సోమవారం తాడేపల్లి ప్రెస్ క్లబ్‌లో ఆవిష్కరించారు. జనసేన సీనియర్ నాయకుడు జొన్న రాజేష్, టీడీపీ నేత గాదె వినయ్ పాల్గొన్నారు. విలేకరుల సమావేశంలో రాజేష్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో తాడేపల్లి సూపర్‌లీగ్ పేరుతో ఉండవల్లిలోని దేవుడి మాన్యం గ్రౌండ్‌లో టెన్నిస్ బాల్ క్రికెట్ లీగ్ నిర్వహిస్తున్నాని తెలిపారు. వినయ్ మాట్లాడుతూ మంగళవారం నుంచి 12వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. మొదట నమోదు చేసుకున్న 30 టీమ్‌లకు మాత్రమే పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. విజేతకు రూ.30 వేలు, రన్నర్‌కు రూ.15 వేలు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రూ. 7 వేలను అందిస్తామన్నారు. అమ్మ ఫౌండేషన్ చైర్మన్ జొన్న శ్రీనివాసరావు, జనసేన మండల కార్యదర్శి చాముండేశ్వరి దేవి, మాధవి, మేకనాని, క్రికెట్ లీగ్ ఆర్గనైజర్స్ కె.దినేష్ చక్రవర్తి, గాజుల సురేష్ పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జొన్న రాజేష్

ఏసీసీ కార్మికుల సమస్యను తక్షణమే పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్: బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం కార్మికులు నిర్వహిస్తున్న రిలే దీక్షలకు మద్దతు తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారాలోకేష్ కార్మికుల సమస్యపై చొరవ చూపి, పరిష్కరించాలన్నారు. సీనియర్ నాయకుడు దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ 32 ఏళ్ల నుంచి కార్మికులు నష్టపరిహారం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వేము రిబ్కా, తుపాకుల కౌసల్య, ఉదయగిరి రమణ, వేముల లక్ష్మి, దర్శి మల్లేశ్వరి కూర్చొనగా, బూరుగ అంకయ్య, ఎం.ఆశీర్వాదం, కె.ఆదినారాయణ, దర్శనపు విజయ్, శారమ్మ, టి.దుర్గాభవాని, రమాదేవి, శివ కుమారి, వై.సాంబశివరావు పాల్గొన్నారు.

తుది బహిరంగ ప్రకటన (IInd Call)

నా క్లయింట్ బొంతిరెడ్డి లక్ష్మారెడ్డి, తండ్రి బొంతిరెడ్డి వెంకట్ రెడ్డి, వయస్సు సుమారు 60 సంవత్సరాలు, నివాసం : 7-28, [illegible], తాడేపల్లి, గుంటూరు జిల్లా వారు దిగువ షెడ్యూల్‌లో ఇచ్చిన ఆస్తిని పూర్వీకుల ఆస్తిని నా క్లయింట్ వారసత్వంగా పొందారని ఈ బహిరంగ ప్రకటన ద్వారా సాధారణ ప్రజలందరికీ ఇందుమూలంగా తెలియజేయడమైనది.

షెడ్యూలు : ఆంధ్రప్రదేశ్, తాడేపల్లి [illegible], గుంటూరు జిల్లా, తాడేపల్లి గ్రామం మరియు మండలం, సర్వే నెం. 113/3లో ఎ. 0.19.5 సెంట్లు విస్తీర్ణం. **హద్దులు** : **తూర్పు** : 30 అడుగుల రోడ్డు, **దక్షిణం** : [illegible], **పశ్చిమం** : బొంతిరెడ్డి [illegible] భూమి, **ఉత్తరం** : [illegible] భూమి.

ఈ బహిరంగ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 10 రోజులలోగా ప్రజలనుండి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలుపవలసినదిగా నా క్లయింట్ కోరుతున్నారు. ఎట్టి అభ్యంతరాలు లేనట్లయితే [illegible] ముందుకు సాగుతారు. [illegible] రోజుల తరువాత నా క్లయింట్ [illegible] సంబంధిత అధికారులను నా క్లయింట్ సంప్రదిస్తారు. ఆ తరువాత ఎట్టి అభ్యంతరాలు పరిశీలించబడవు. అందువలన ఈ బహిరంగ ప్రకటన జారీచేయడమైనది.

సం/- జె.యు.ఎమ్.వి.ప్రసాద్,
అడ్వకేట్, హైకోర్టు ఎట్ అమరావతి, ఫ్లాట్ నెం. 202, [illegible] అపార్ట్‌మెంట్, [illegible] ఆఫీస్ ఎదుట, [illegible], తాడేపల్లి, గుంటూరు జిల్లా-522 501. సెల్ : 94400 46193

